క్లుప్తంగా

ఆధార్ నమోదు శిబిరాలు ప్రారంభం

కంకిపాడు: సచివాలయాల్లో ఆధార్ నమోదు శిబిరాలను గురువారం ప్రారంభించారు. 0- 6 ఏళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదు కోసం ప్రత్యేకంగా కంకిపాడు గ్రామ పంచాయతీ, పునాదిపాడు- 1 సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు ఆయా సచివాలయాల్లో 35 మంది ఆధార్ సేవలను పొందారు. శిబిరాన్ని సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ

గన్నవరం: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం మదుపల్లి విజయ కుమార్ జ్ఞాపకార్థం ఆయన కుమార్తె, అల్లుడు స్వాతి, చంద్రశేఖర్ పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ గన్నవరం శాఖ అధ్యక్షులు మదుపల్లి బాలకృష్ణ మూర్తి, మానవత కార్యదర్శి కర్రా వరప్రసాద్, సంయుక్త కార్యదర్శి వీసం ప్రసాదరావు, సభ్యులు మోటమర్రి శేఖర్, వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ చార్జీలు తగ్గించాలి



కంకిపాడు: అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. కంకిపాడు రామాలయం సెంటరులో అఖిల భారత మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక మహిళలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. సంఘం నేత ఈ.కనకదుర్గ మాట్లాడుతూ అద్దె ఇళ్లల్లో జీవించే తమపై పెంచిన విద్యుత్ చార్జీలు భారంగా మారాయన్నారు. అధిక ధరలు, చాలీచాలని కూలీ సొమ్ములతో కుటుంబాలు గడవటమే కష్టంగా ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయక పోగా విద్యుత్ చార్జీలను పెంచటం దారుణమన్నారు. అదనపు చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ ప్రతినిధులు పద్మ, పి.లక్ష్మి, పి.అనసూర్యావతి, వి.ఆశా, బి.మంజు, టి.దివ్య, స్రవంతి, ఎం.సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.9.5 లక్షలతో డ్రెయిన్ పనులు ప్రారంభం


నున్న(విజయవాడరూరల్): స్థానిక పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో గ్రామ పంచాయతి నిధులు రూ.9.50 లక్షలతో డ్రెయిన్ కమ్ సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. 93 మీటర్ల పొడవు, 3.3 మీటర్ల వెడల్పు కొలతలతో పనులు జరుగుతున్నాయని ఇంజినీరింగ్ సహాయకులు తెలియజేశారు.

భారీ వర్షానికి రహదారులు జలమయం



గన్నవరం: మండల పరిధిలో గురువారం కురిసిన భారీ వర్షానికి లోతట్టులోని రహదారులు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా, మధ్యాహ్నం పూర్తిగా మేఘావృతమై వాతావరణం చల్లబడింది. సాయంత్రానికి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం నీరు లోతట్టులోని రహదారులపైకి చేరడంతో జలమయమయ్యాయి. స్థానిక కొత్తపేట వద్ద చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారిపైకి అడుగు ఎత్తులో వర్షం నీరు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గన్నవరం ప్రాంతంలో పలుచోట్ల డ్రెయిన్లు పూడుకుపోవడంతో వర్షం నీటికి రోడ్లు చిత్తడిగా మారాయి. భారీ ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలడంతో రైతులు కొంతమేర నష్టపోయారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా వద్దగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు ప్రభుత్వ టెక్స్ట్ బుక్స్‌తో పాటు 12 నోట్ బుక్స్ ఉచితంగా పంపిణీ చేశారు. గురువారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు కష్టపడి చదువుకుని ఇటు కళాశాలకు అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం (2025-26) నుంచి తమ కాలేజీలో కొత్తగా ఎంబైపీసీ, ఎంఈసీ, ఒకేషనల్ కోర్సులు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎమ్ఎల్‌టీ), మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎమ్‌పీహెచ్‌డబ్ల్యూ) కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

దిగుబడులు భళా..

కొనుగోళ్లు లేక డీలా

- ప్రారంభమైన రబీ వరి కోతలు
- మార్కెట్‌కు చేరుతున్న ధాన్యం
- మద్దతు ధర కోసం అన్నదాతల అగచాట్లు

జాడ లేని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు



చలివేంద్రపాలెం సమీపంలో యంత్రంతో వరి కోత పనులు చేస్తున్న కూలీలు

కంకిపాడు: సీజన్‌లు మారుతున్నాయే తప్ప అన్నదాత కష్టాలు మాత్రం తీరటం లేదు. ఏ ఏటి కాయేడు కష్టాలు.. నష్టాలే. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే నాటికి ప్రభుత్వం రిక్త హస్తం చూపుతోంది. దీంతో సరైన మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు రైతుల పట్ల అడుగడుగునా నిర్లక్ష్యం కనబరుస్తోంది.

దిగుబడులు ఘనం..

రబీ వరి సాగులో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు విత్తనం, పైపాటు, సమగ్ర యాజమాన్య చర్యలకు రూ. 35 వేల వరకూ పెట్టి సాగు చేశారు. పంట చేతికొచ్చింది. ఎకరాకు సరాసరిన 42 నుంచి 45 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. తెగుళ్ల బెడద తగ్గటంతో దిగుబడులు ఆశించిన మేరకు లభించాయని అంటున్నారు.

చితికిపోతున్న అన్నదాత..

దిగుబడులు చూసి ఆనందించే లోపే రైతులు దళారుల చేతిలో చితికి దిగాలు చెందుతున్నారు. పంట మార్కెట్‌కు చేరుతుండటంతో దళారులు, మిల్లర్లు పంట పొలాల్లోకి వెళ్లిపోతున్నారు. ఉన్న పళంగా కోసిన ధాన్యం కోసినట్లుగా మిల్లుకు తరలించేందుకు 75 కిలోల బస్తాకు రూ.1,250 నుంచి రూ.1,300 మాత్రమే ఇస్తామని నొక్కి మరీ పంటను తరలించుకుపోతున్నారు. కొనుగోలు కేంద్రాల జాడ లేకపోవటంతో రైతులు కూడా చేసేది లేక దళారులకే అమ్మి సొమ్ము చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.



నూర్పిడి చేసిన ధాన్యాన్ని విజయవాడ-మచిలీపట్నం హైవేపై ఆరబోస్తున్న దృశ్యం

కొనుగోలు కేంద్రాల ఊసేదీ?

వరి కోత పనులు మూడు రోజులుగా సాగుతున్నాయి. పంట మార్కెట్‌కు చేరుతోంది. అయినా ఇప్పటి వరకూ రబీ వరి కొనుగోళ్లపై ప్రభుత్వం ఎలాంటి ముందడుగు వేయలేదు. పౌరసరఫరాల సంస్థ పంట దిగుబడులు వచ్చే నాటికే రైతు సేవా కేంద్రాలను సిద్ధం చేయటం, కొనుగోలు ప్రక్రియకు సన్నాహాలు చేయటం జరగలేదు. 12,285 ఎకరాల్లో వరి సాగు చేయటం ద్వారా 43,824 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తుందని వ్యవసాయశాఖ అంచనాలు చెబుతున్నాయి. ఖరీఫ్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 44,521 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనాలే ఉన్నాయి. ఖరీఫ్‌లో ఏర్పడిన నష్టాన్ని అధిగమించి ఒడ్డున పడాలనే ఆశతో రైతులు అనుమతులు లేకున్నా బోర్ల సదుపాయం ఉన్న భూముల్లో వరి సాగు చేసుకున్నారు. దిగుబడులు ఘనంగా వచ్చాయి. కానీ అధికారులు, పాలకులు రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర అందించే విషయంలో వైఫల్యం చెందారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

జిల్లాలో పరిస్థితి..

కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రబీ సాగుకు అనుమతి అధికారికంగా లేదు. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని పాలకులు, అధికారులు సూచించారు. అయితే బోర్ల సదుపాయం ఉన్న రైతులు, అపరాల పంట సాగుకు అనువుగా లేని భూముల్లో రైతాంగం రబీ వరి సాగు చేపట్టారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 12,285 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రధానంగా ఎంటీయూ 1156, 1153, 1121, 1010, 1061, బీపీటీ 5204, పీఆర్ 126 విత్తన రకాలను రైతులు సాగుకు ఎంచుకున్నారు. మూడు రోజులుగా జిల్లాలోని పలు చోట్ల పంట చేతికి రావటంతో వరి కోత యంత్రాలతో వరి కోత పనులను నిర్వహిస్తున్నారు.

తక్షణమే తెరవాలి..



రబీ వరి పంట చేతికొచ్చింది. ఎకరాకు రూ. 30 వేలకు పైగా పెట్టుబడులు అయ్యాయి. దిగుబడులు బాగా వచ్చాయి. ఖరీఫ్‌లో జరిగిన నష్టం నుంచి తేరుకోవాలంటే రబీలో కూడా మద్దతు ధర అందేలా పాలకులు చర్యలు తీసుకోవాలి. అప్పుడే అన్నదాతలకు మేలు జరుగుతుంది. త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవాలి.

– నకరికంటి శేఖర్, కౌలు రైతు, ఈడుపుగల్లు

సమీక్షలు జరుగుతున్నాయి..

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఇంకా సమీక్ష జరుగుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లపై చర్చించాలి. పది వేల టన్నులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నుంచి సూచన ప్రాయంగా ఆదేశాలు వచ్చాయి. ఏ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు తెరవాలి అన్నదానిపై చర్చించి రెండు మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం.

– పద్మాదేవి, జిల్లా మేనేజరు, జిల్లా పౌరసరఫరాల సంస్థ

బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ సాయం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన పేరుబోయిన జీవానందం కుటుంబ సభ్యులకు పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ మృతుడి కుటుంబ సభ్యులకు చక్రవర్తి ఇచ్చిన రూ.10 వేలను అందజేశారు. వైఎస్సార్ సీపీ పేద వర్గాలకు అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ నేతలు అద్దేపల్లి చందు, నల్లమోతు జీవన్, ఉప్పల వీరబాబు, చుండూరు శేఖర్‌బాబు, వర, ముచ్చు నాగేంద్ర బాబు, దుర్గాప్రసాద్, రమేష్‌బాబు పలువురు పాల్గొన్నారు.

మాల కార్పొరేషన్ డైరెక్టర్ ప్రమాణస్వీకారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏపీ మాల వేల్ఫేర్ అండ్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హనుమాన్‌జంక్షన్‌కు చెందిన దయాల రాజేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ప్రస్తుతం టీడీపీ మండల అధ్యక్షుడిగా రాజేశ్వరరావు వ్యవహరిస్తుండగా, ఆయన భార్య విజయనిర్మల గతంలో బాపులపాడు ఎంపీపీగా, సర్పంచ్‌గా పనిచేశారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన దయాల రాజేశ్వరరావుకు పలువురు స్థానిక ప్రముఖులు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ శుక్రవారం మహదేవపురం కాలనీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. ఈ కారణంగా టీచర్స్ కాలనీ, 80 అడుగుల రోడ్డు, పంటకాలువ రోడ్డు, ధనేకుల కల్యాణ మండపం ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని తెలిపారు.

డ్రోన్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులు రూపొందించిన డ్రోన్స్‌ను పరిశీలిస్తున్న సదాశివన్ గిరీష్

పెనమలూరు: డ్రోన్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు లభించటమే కాకుండా నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని బెంగుళూరుకు చెందిన ఆరవ్ మానవ రహిత సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రిమోట్ పైలెట్ శిక్షకుడు సదాశివన్ గిరీష్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో గురువారం డ్రోన్ ఫ్యూజన్ ఈవెంట్ ప్రారంభ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. డ్రోన్స్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, వ్యవసాయం, విత్తనాలు నాటడం, ఆరోగ్య సంరక్షణ ఇలా అనేక అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. డ్రోన్, రోబోటిక్ మనిషి శక్తిని సమయాన్ని తగ్గించి ఉత్తమ ఫలితాలు సాధించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. భవిష్యత్తులో డ్రోన్స్ వినియోగం చాలాపెరుగుతుందని, విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. వైస్ ఛాన్స్‌లర్ పి.వెంకటేశ్వరరావు డ్రోన్ హ్యాకథాన్‌లో 114 మంది పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, ఈఈఈ విభాగాధిపతి నరసింహం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీపీఎస్‌లో ఘనంగా స్నాతకోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎం.భాను చిత్ర, ప్రవీణ్ కుమార్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లస్ టూ పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లును ముఖ్య అతిథిగా హాజరైన రీసెర్చ్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ అసోసియేట్ ప్రొఫెసర్, డీన్ ఎం.భాను చిత్ర, పాఠశాల డైరెక్టర్ కడియాల ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. భాను చిత్ర మాట్లాడుతూ డీపీఎస్‌లో చదివిన విద్యార్థులు పలు దేశాలలోని యూనివర్సిటీలలో రూ. 1.8 కోట్ల స్కాలర్ షిప్‌లతో 16 మందికి పైగా ఐఐటీ విభాగంలో సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. ఈ జనరేషన్‌కు చెందిన మీరంతా కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసి భవిష్యత్ తరాలకు అందించి జూనియర్స్‌కు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల డైరెక్టర్లు పరిమి పవన్ చంద్, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా, పాఠశాల ప్రోవైస్ చైర్మన్ పరిమి నరేంద్రబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరవల్లి రైల్వే క్రాసింగ్ ప్రాంతం పరిశీలన



వీరవల్లి రైల్వే క్రాసింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో, రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి- కొమ్మూరు రోడ్డులో రైల్వే స్టేషన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రెవెన్యూ, రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు గురువారం సంయుక్తంగా పరిశీలన చేశారు. వీరవల్లిలోని రైల్వే క్రాసింగ్ వద్ద తరుచూగా ట్రాఫిక్ స్తంభించటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించారు. వీరవల్లి రైల్వే స్టేషన్ నుంచి మల్లవల్లి, కొమ్మూరు రోడ్డు వైజంక్షన్ వరకు ఆర్వోబీ నిర్మించాలని గుడివాడ ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యంకు మాజీ సర్పంచ్ పిల్లా రామారావు, ఉప సర్పంచ్ లంక అజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యానారాయణ వినతిపత్రం అందించారు. దీనిపై రైల్వే శాఖకు ప్రతిపాదనలు పంపుతామని బదులిచ్చారు. తహసీల్దార్ బి.మురళీకృష్ణ, ఆర్ అండ్ బీ డీఈ బలరాం, ఏఈ అరవింద్, రైల్వే శాఖ జేఈ డి.సుందర్, సర్వేయర్ ఫణికుమార్, రైల్వే ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హోటల్ రంగానికి రాయితీ ఇస్తే పర్యాటకం అభివృద్ధి

ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వీ స్వామి

రామవరప్పాడు: స్టార్ హోటల్స్ చెల్లిస్తున్న లైసెన్స్ ఫీజు తగ్గిస్తూ క్యాబినెట్ ఆమోదించడం పట్ల సీఎం చంద్రబాబుకు ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి కృతజ్ఞతలు తెలియజేశారు. గుణదలలోని హయత్ హోటల్‌లో గురువారం ఏపీ హోటలర్స్ అసోసియేషన్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌వీ స్వామి మాట్లాడుతూ హోటల్ రంగానికి రాయితీ ఇస్తే పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యాటకరంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని దీన్ని హోటల్స్ అసోసియేషన్ స్వాగతిస్తుందన్నారు. ఏపీలో సముద్రతీరం వెంబడి రిసార్ట్స్ ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. గేట్ వే హోటల్ అధినేత మలినేని రాజయ్య మాట్లాడుతూ స్టార్ హోటల్స్ ఏర్పాటు కావాలంటే ఐటీ రంగం అభివృద్ధి చెందాలన్నారు. హోటల్ రంగ ప్రముఖులు గోకరాజు గంగరాజు పాల్గొన్నారు.

చెత్త సమస్యకు చెక్

చెత్త దంపింగ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన మొక్కలు



మొక్కల సంరక్షణకు ఏర్పాటుచేసిన ఫెన్సింగ్



చెత్త సమస్యకు చెక్ పెట్టారు గోసాల పంచాయతీ అధికారులు. చెత్త డంపింగ్ చేసే ప్రదేశంలో అందమైన పూలమొక్కలు, క్రోటాన్ జాతి మొక్కలు నాటి వాటి చుట్టూ ఫెన్సింగ్ కూడా కట్టారు. వివరాల్లోకి వెళితే.. కంకిపాడు- గోసాల సరిహద్దు ప్రాంతంలో ప్రధాన రహదారి వెంబడి చెత్త డంపింగ్ చేస్తుండేవారు. నిత్యం ఇక్కడ చెత్త, వ్యర్థాల తరలింపు తలకు మించిన భారంగా మారింది. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చెత్త, వ్యర్థాలను తొలగించి అక్కడ రబ్బిష్, ఇతర నల్లమట్టితో చదును చేయించారు. అందమైన రంగురంగుల పూలమొక్కలు, క్రోటాన్ మొక్కలు నాటారు. వాటి సంరక్షణ నిమిత్తం ఆ ప్రాంతం చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటుచేసి సమస్యకు పరిష్కారం చూపారు. – కంకిపాడు

నైతిక విలువలతో కూడిన విద్య నేర్పాలి



ఉయ్యూరు: నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తేనే ఉజ్వల భవిత ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని ఎంకే పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పార్థసారథి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలను తిలకించి, ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ విద్యతోనే పేదరికం రూపుమాపబడుతుందన్నారు. పాఠశాలల యాజమాన్యాలు క్రమశిక్షణతో కూడిన విద్య నేర్పటంతో పాటు విద్యార్థులకు విలువలను బోధించాలన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించేలా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, మాజీ చైర్మన్ జంపాన పూల, తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యంపై కేసు

పెనమలూరు: భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటనపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేయటంతో గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు..పోరంకి సాయి నగర్‌కుచెందిన డీఎన్. చెన్నకేశవులు భార్య దర్శి అంజలిని నాగేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు, అతను రైల్వేలో ట్యాంకుల్లో నీరు నింపే పని చేస్తాడు. వీరికి గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల ఒకటిన పెద్దలు ఇద్దరికి నచ్చచెప్పారు. అయితే భర్త అదే రోజు రాత్రి పనికి వెళ్లగా భార్య అంజలి, బావమరిది బ్రహ్మానాయుడు, ఇద్దరు పిల్లలు ఇంట్లో ఉన్నారు. అర్ధరాత్రి అంజలి, తన ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి అదృశ్యమైంది. రాత్రి నిద్రలేచిన బావమరిది అంజలి, ఇద్దరు పిల్లలు కనబడక పోవటంతో చిన్నకేశవులుకు ఫోన్‌లో చెప్పాడు. పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కంకిపాడు: వివిధ కార్పొరేషన్‌ల కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష అన్నారు. గురువారం ఆమె వివరాలు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ కార్పొరేషన్‌ల రుణాల జారీకై అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. బ్యాంకర్లు అర్జీదారులను ఇంటర్వ్యూ చేసి రుణాలు జారీ చేస్తారన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. అర్జీదారులు తమ ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ, బ్యాంకు పాస్‌పుస్తకం, అసలు, నకళ్లను తీసుకుని ఇంటర్వ్యూలో పాల్గొనాలని సూచించారు.

పెనమలూరు: మండల పరిధిలో వివిధ కార్పొరేషన్‌లకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుమని ఎంపీడీవో బండి ప్రణవి తెలిపారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.